మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


# ప్రత్యేక నిఘా

- మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలపై పోలీస్ శాఖ నజర్
- పోలింగ్ కేంద్రాలపై మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి నిఘా
- శాంతియుత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**మహబూబ్‌నగర్, అడ్డాకుల, మూసాపేట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలోని ఎన్నికలు జరుగుతున్న అన్ని మండలలో విస్తృతంగా పర్యటించారు. అడ్డాకుల మండలం అడ్డకల్, కందూరు, మూసాపేట మండలం జానంపేట, భూత్పూర్ మండలం అన్నాసాగర్, బాలానగర్ మండలం ఉడిత్యాల, గంగాధర్పల్లి, మోతీఘన్‌పూర్ మరియు జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షి ంచారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేలా సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా



గంగపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పి జానకీ

ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా అన్ని భద్రతా – మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి

# మీరే సజీవ గ్రంథాలయాలు

- మీ అనుభవమే మార్గదర్శకం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- రిటైర్డ్ ఉద్యోగులు. పెన్షనర్ల సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్17,ప్రభాతవార్త:** ప్రపంచ పెన్షనర్స్ డే సందర్భంగా, తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ నగరంలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన సమావేశానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పెన్షనర్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉద్యోగ జీవితం ముగిసినా, సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యత ఎప్పటికీ ముగియదని అన్నారు. ప్రభుత్వ విభాగాల్లో దశాబ్దాల పాటు నిబద్ధతతో పనిచేసి, ప్రజాసేవనే ధ్యేయంగా తీసుకుని ముందుకు సాగిన రిటైర్డ్ ఉద్యోగులు సమాజానికి సజీవ గ్రంథాలంటూ కొనియాడారు. వారి అనుభవం, క్రమశిక్షణ, విలువలు నేటి యువతకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగడంలో ప్రభుత్వ ఉద్యోగుల సేవలు కీలకమని, ఆ సేవలకు పునాది వేసింది రిటైర్డ్ ఉద్యోగుల త్యాగమని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పరిపాలనా వ్యవస్థలో ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాలు నేటి పాలనకు మార్గనిర్దేశకంగా నిలుస్తున్నాయని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవలు, విద్యా, మార్గదర్శక కార్యక్రమాలు, యువత అవగాహన కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత సేవ చేయవచ్చని సూచించారు. అనుభవజ్ఞులైన పెన్షనర్ల సలహాలు ప్రభుత్వ విధానాల అమలులో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ – మిగతా3లో..

# నేను పార్టీ మారలె..

- అభివృద్ధి కోసమే సీఎంను కలిశా
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**గద్వాల టౌన్ డిసెంబర్ 17, ప్రభాతవార్త:** నేను పార్టీ మారలేదని, నియోజక వర్గ అభివృద్ధి కోసమే రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి నీ కలిశానని గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదులపై జరిగిన విచారణలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సాదరంగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఫిరాయింపుల ఫిర్యాదులపై విచారణ జరిపిన స్పీకర్, ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అభివృద్ధికి రాజకీయాలు అడ్డుకావన్నారు. తాను పార్టీ మారలేదని, కేవలం తన నియోజకవర్గమైన గద్వాల అభివృద్ధి –మిగతా4లో..

## ఉమ్మడి జిల్లాలో పోలింగ్ శాతం వివరాలు..

| జిల్లా | పోలింగ్ శాతం | మొత్తం ఓటర్లు | పోలైన ఓటర్లు |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 88.36 | 142909 | 126280 |
| నాగర్‌కర్నూల్ | 83.1 | 179464 | 149222 |
| వనపర్తి | 83.22 | 130159 | 108315 |
| జోగుళాంబ గద్వాల | 88.54 | 100372 | 88865 |
| నారాయణపేట | 83.53 | 152648 | 127502 |

# 85.35 శాతం పోలింగ్

**అత్యధికం** జోగుళాంబ గద్వాల

**అత్యల్పం** నాగర్‌కర్నూల్

- ఉమ్మడి పాలమూరులో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్17,ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికలు బుధవారంతో ముగిసాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నది. బుధవారం జరిగిన మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరులో సగటున 85.35 పోలింగ్ నమోదు అయ్యింది. అక్షరాస్యతలో తక్కువగా ఉన్న జోగులాంబ గద్వాల జిల్లా పోలింగ్ శాతం నమోదు లో ముందంజలో ఉండటం విశేషం. నాగర్ కర్నూలు జిల్లాలో అత్యల్పంగా 83.1 పోలింగ్ నమోదు అయ్యింది.

- బిఆర్ఎస్ ఖాతాలో చేరిన బోడ జానంపేట
- 152 ఓట్లతో విజయం సాధించిన రాజేందర్ ఠాగూర్
- రీకౌంటింగ్ చేయాలంటూ ఆందోళన
- పోలీసుల లాఠీ చార్జ్



# రెండు ఓట్లతో గెలుపు



**బాలానగర్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలంలోని బోడ జానంపేట లో గ్రామపంచాయతీలో రెండు ఓట్ల తో బి ఆర్ ఎస్ మద్దతు దారుడు గెలుపొందాడు. మొత్తం 569 ఓటర్లు ఉన్న గ్రామపంచాయతీ లో బుధవారం మూడో దశ ఎన్నికలు జరిగాయి. ఇందులో భాగంగా బి.ఆర్.ఎస్ మద్దతు దారుడు రాజేందర్ ఠాగూర్ కు 152 ఓట్లు రాగా, కాంగ్రెస్ మద్దతుదారుడు పొట్లపల్లి యాదయ్యకు 150 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా 146 ఓట్లతో నరసింహులు నిలిచారు. అయితే రెండు ఓట్ల తేడాతో విజయం సాధించడంతో సమీప అభ్యర్థి ఆందోళనకు దిగారు. రీకౌంటింగ్ చేయాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు రీకౌంటింగ్ చేసినా ఫలితంలో ఎలాంటి మార్పు రాలేదు. అయినా ఈ విషయాన్ని దీనినించుకోలని కొంతమంది ఆందోళనకు దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను చదరగొట్టడంతో పరిస్థితి సర్దుమనిగింది. లాటి చార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. రెండుసార్లు రీకౌంటింగ్ చేసినా ఫలితంలో ఎలాంటి మార్పు రాకపోవడంతో రాజేందర్ ఠాకూర్ ను సర్పంచ్ గా గెలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే పోలీసులు అర్ధరాత్రి వరకు పికేటింగ్ నిర్వహించారు.

# రోడ్డెక్కిన విద్యార్థులు 4

- ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి
- లేదంటే డిపో మేనేజర్ రాజీనామా చేయాలి..
- నారాయణపేట డిపో ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన



రోడ్డుపైన ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

# రీ పోలింగ్ జరపాలి

- తూముకుంట గ్రామస్తుల ఆందోళన
- ఎన్నికను రద్దు చేయాలంటూ కలెక్టర్ ఎదుట నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**గద్వాల, డిసెంబ ర్17, ప్రభాతవార్త:** అయిజ మండలం తూముకుంట గ్రామంలో సర్పంచ్ ఎన్నికలను రద్దు పరిచి రీ పోలింగ్ జరపాలని బుధవారం కలెక్టరేట్ ముందు తూముకుంట సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసిన అల్వాల శ్రీనివాస్ గౌడ్, చిట్టెం కిష్టన్న, ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ విడతలో ఈనెల 14న అలంపూర్ తాలూకా అయిజ మండలం తూముకుంట గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికారులు నిరక్ష ్యం చేశారని, ఎన్నికల అధికారులు ఇచ్చిన స్లిప్పుల పై దాదాపుగా 70కి పైగా ఓటర్లు సంతకాలు చేసిన కౌంటర్ ఫైల్ తో పాటు బ్యాలెట్ పేపర్‌తో సహా బ్యాలెట్ బాక్స్ లో వేశారని, దీంతో అధికారులు ఓటర్ గోప్యతకు భంగం కల్పించారని ఈ నిరక్ష్యానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అనంతరం రిటర్నింగ్ అధికారులు ధృవీకరించిన పత్రంలో గ్రామంలో మొత్తం ఓట్లు 1819 వుండగా ఒక ధృవీకరణ పత్రంలో 1699 ఓట్లు చెల్లు బాటు అయినట్లు ఇచ్చారని, మరోసారి 1659 ఓట్లు చెల్లుబాటు అయినట్లు ధృవీకరణ చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మాకు తీవ్ర అన్యాయం జరిగిందని అందుచేత తూముకుంట గ్రామంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించిన సర్పంచ్ అభ్యర్థి గెలుపును రద్దు చేయాలని, ఉప సర్పంచ్ ఎన్నికను కూడా రద్దు పరిచి రీ పోలింగ్ జరపాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కృష్ణయ్య గౌడ్, ఏసు రాజు, కేసారం, రసూల్, ఆంజనేయులు, వెంకటేష్ మణి, తిమ్మరాజు గౌడ్, మాజీ ఉపసర్పంచ్ భీమన్న, మహేష్, రామాంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మూడో విడత ఎన్నికలు ప్రశాంతం

పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

కలెక్టర్ బి యం సంతోష్



ఎన్నికల కౌంటింగ్ ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల,డిసెంబర్ 17, ప్రభాత వార్త:** మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తి శాంతియుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. బుధవారం మానవపాడు, ఎర్రవల్లి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్‌లో పారదర్శకత, ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ పత్రాలను లెక్కించి,తరువాత వార్డ్‌మెంబర్ బ్యాలెట్ పేపర్లను వేరు చేసి క్రమపద్ధతిలో ఓట్లను లెక్కించాలని అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల లెక్కింపులు పూర్తయ్యాక సర్పంచ్ బ్యాలెట్ పత్రాలను కలిపి అభ్యర్థుల వారీగా లెక్కించాలని స్పష్టంగా సూచించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ వ్యవస్థ, సిబ్బంది సమన్వయం సమర్థవంతంగా సాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫలితాలు వెలువడిన తరువాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ అనంతరం పోలింగ్ సామాగ్రిని రిసెప్షన్ కౌంటర్లో అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నర్సింగ రావు, పదవ బెటాలియన్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ నరేందర్ రెడ్డి, ఎన్నికల అధికారులు నుషిత, నరేష్, సయీద్ ఖాన్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో 88.36శాతం నమోదు

- మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మూడవ విడత ఎన్నికలు
- పోలింగ్,కౌంటింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకీ

**మహబూబ్ నగర్ బ్యూరో, డిసెంబర్ 17 :** మహబూబ్ నగర్ జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతలలోనూ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా కొనసాగాయని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మూడవ విడత పోలింగ్ బుధవారం ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. ఉదయం 9.00 గంటల సమయానికి సగటున 25.38 శాతం పోలింగ్ నమోదయ్యింది. 11 గంటల సమయానికి 60.63



పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి

శాతం,ఒంటి గంటకు 81.44 శాతం,తుది పోలింగ్ శాతం 88.36 శాతం ఓటింగ్ జరిగింది కాగా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభం నుండి పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి పోలింగ్ ప్రక్రియ పరిశీలించారు. మూడవ విడత ఎన్నికలు జరుగుతున్న మూసాపేట మండలం జానంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం అడ్డాకల్ మండలం గుడిబండ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అడ్డాకల్‌గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను,మూసాపేట మండలం కొమిరెడ్డి పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో,బాలానగర్ మండలం మోతీ ఘనపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలానగర్ మండల కేంద్రం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, కేతిరెడ్డి పల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించి అక్కడున్న అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని ఐదు మండలాల్లో ఉదయం 9 గంటల వరకు 25.38 శాతం పోలింగ్ నమోదవగా, ఉదయం 11 గంటల వరకు 60.63 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 81.44 శాతంపోలింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. మెడికల్ క్యాంపు, ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? అని తనిఖీ చేశారు.

**122 స్థానాలు..1152 పోలింగ్ కేంద్రాలు..**

మూడవ విడతలో మొత్తం 133 సర్పంచ్ స్థానాలకు గాను, నామినేషన్ల ఉపసంహరణ నాటికే 10 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. జడ్చర్ల మండలం లో ఒక సర్పంచ్ స్థానానికి ఎవ్వరూ నామి నేషన్ దాఖలు చేయనందు మిగిలిన 122 సర్పంచ్ స్థానాలకు – మిగతా4లో..

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా





**ఇటిక్యాల డిసెంబర్ 17, ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గంలోని బుధవారం మూడవ విడత ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డ్ మెంబర్లకు ఎన్నికలు జరిగాయి. ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, అదే గ్రామానికి చెందిన ఎమ్మెల్యే విజయుడు, ఆయన సతీమణి పుల్లూరు గ్రామంలోని సొంతూరులో సర్పంచ్ ఎన్నికల్లో వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## వైశాఖపురంలో వైద్య విద్యార్థిని గెలుపు

**1022 ఓట్లతో సత్తా చాటిన నిఖిత**



**పెబ్బేరు డిసెంబర్ 17 ప్రభాతవార్త:** మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో వైద్య విద్యార్థిని తన సత్తా చాటింది. రాజకీయ అనుభవం లేకున్నా.. కుటుంబంలో రాజకీయ ప్రస్థానం లేకపోయినా వైశాఖపురం – మిగతా4లో..

## మూడో విడతలో మిశ్రమ ఫలితాలు



- అధికార పార్టీ ఎమ్మెల్యేల సొంతూర్లో సర్పంచుల ఓటమి
- జీపీ ఎన్నికల్లో సగం సగం పంచుకున్న కాంగ్రెస్,బీఆర్ఎస్ – వివరాలు4లో..

## 18న ఛలో ఇందిరపార్క్

**- తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రెసెంటేటివ్ పిలుపు**

**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్17,ప్రభాతవార్త:** తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రెసెంటే ట్యాస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిసెంబర్ 18న చలో ఇందిరపార్క్ ముందు ధర్నాకు జిల్లాలోని మెడికల్ రిప్పులందరూ పెద్దఎత్తున తరలిరావాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున్, శోభన్ యాదవ్ ,సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని ,సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను పరిరక్షించాలని, ప్రజలకు సరసమైన ధరలకు ప్రాణాంతక తదితర మందులను సరసమైన ధరలకు సరఫరా చేయాలని, గుండె, కిడ్నీ, బీపీ షుగర్ తదితర వ్యాధులకు సంబంధించిన మందుల ధరలను తగ్గించాలని మెడికల్ రిప్స్ కు న్యాయమైన వేతనాలు ఇవ్వాలని,8 పనిగంటలు పని అమలుపరచాలని, మేనేజ్మెంట్ల వేధింపులు ఆపాలని, మెడికల్ రంగంలో కార్పొరేట్ల ఆధిపత్యాన్ని తగ్గించాలని తదితర డిమాండ్లతో 18వ తేదీన ఇందిరాపార్క్ లో ఉదయం 10 గంటల నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు జరిగే ధర్నాకు జిల్లాలోని మెడికల్ రిప్స్ అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణ ఔన్నత్యాన్ని చాటాలి

**- పీయూ వీసీ ఆచార్య జిఎన్ శ్రీనివాస్**

**- ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఎంపికైన విద్యార్థినికి అభినందన**

**మహబూబ్‌నగర్, డిసెంబర్17,ప్రభాతవార్త:** పీయూ ఆవిర్భవించిన 14 సంవత్సరాలలో పరేడ్ వేడుకలకు ఎన్నికైన పద్మావతి మొదటి విద్యార్థి అని అభినందించిన ఉపకులపతి ఆచార్య జిఎన్ శ్రీనివాస్ పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఉన్న పిల్లలమర్రిలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతున్న మహబూబ్నగర్‌కు చెందిన విద్యార్థి పత్లావత్ పద్మావతి జనవరిలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో రిపబ్లిక్ డే పరేడ్‌కు వేడుకలకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ దశలలో స్క్రీనింగ్ ఎదుర్కొని ఢిల్లీలో జరిగే వేడుకలకు పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఉన్న వి.పద్మావతి ఎన్నిక పీయూకు గర్వకారణం అని, యూనివర్సిటీ ప్రారంభమైన 14 ఏళ్ల కాలంలో మొట్టమొదటిసారి పద్మావతి అనే విద్యార్థిని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎన్నికయిందని, అక్కడ జరిగే వేడుకలలో తెలంగాణ ఔన్నత్యాన్ని చాటాలని, పరేడ్ వేడుకలకు ఎన్నిక కావడం ద్వారా రాష్ట్రపతి,ప్రధానమంత్రి మొదలగు ముఖ్య నాయకులను కలిసే అద్భుత అవకాశం విద్యార్థులకు లభిస్తుందని, ఈ పరేడ్ ఎన్నిక ద్వారా భిన్నత్వంలో ఏకత్వం చాటాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె ప్రవీణ, కంటిన్జెంట్ అధికారి డాక్టర్ ఎస్ ఎన్ అర్జున్ కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థిని పద్మావతిని అభినందిస్తున్న వీసీ శ్రీనివాస్

## రేపు వర్తకపు జాతర

**- ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి**

**మహబూబ్‌నగర్, డిసెంబర్17,ప్రభాతవార్త:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబ్ నగర్, కామర్స్ విభాగం ఔత్సాహిక అభివృద్ధి విభాగం సంయుక్తంగా వినియోగదారుల దినోత్సవం 2025 ను పురస్కరించుకొని నిర్వహిస్తున్న "వర్తకపు జాతర" రేపు అనగా (శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ వర్తకపు జాతరలో విద్యార్థులు వారియొక్క సృజనాత్మకతతో వస్తువులను స్వయంగా తయారుచేసి ప్రదర్శించటం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగినవారు ఆ వస్తువులను నామ మాత్రపు ధరతో కొనుగోలు చేయవచ్చును. ఈ ప్రదర్శనలో 28 స్టాల్స్ వివిధ రకాల వస్తువులను 45 మంది విద్యార్థులు ప్రదర్శిస్తారు. అత్యుత్తమ మొదటి మూడు స్టాల్స్ కు నగదు ప్రోత్సాహకాలు వరుసగా రూ. 2,000/, రూ. 1,500/, రూ. 1,000 / లతో పాటు విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను అందజేయటం జరుగును. సమీప కళాశాలల విద్యార్థులు కూడా సందర్శించి, మా విద్యార్థుల ప్రతిభను గుర్తించి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

## చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి

**వెల్దండ, డిసెంబర్ 17 ప్రభాతవార్త:**మండల పరిధిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన 50వేల చేపపిల్లలను బుధవారం మత్స్యకార సొసైటీ జిల్లా డైరెక్టర్ క్యాసరపు వెంకయ్య ముదిరాజ్, వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్‌తో కలిసి కొండకత్వ చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా స్థానిక చెరువులలో చేప పిల్లల పెంపకని ప్రోత్సహించి మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఎంతో తోడుబాటనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ ఉపాధ్యక్షుడు అన్నెపు వెంకటేష్, మండల ముదిరాజ్ అధ్యక్షులు బాదేపల్లి మల్లయ్య, గ్రామ ఉపసర్పంచ్ బస్సమోని శ్రీనివాస్, వార్డు సభ్యులు వాణి పురుషోత్తం, కిష్టల్, భయ్య మల్లయ్య, మట్ట నిరంజన్, రషీద్, భరత్, శ్రీనివాస్, నిరంజన్, శివ, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



చెరువులో చేపలను వదులుతున్న దృశ్యం

## 524 ఓట్ల మెజార్టీతో నిర్మల బాలస్వామి విజయం

**- నస్రుల్లాబాద్‌లో కాంగ్రెస్**

**జడ్చర్ల,డిసెంబర్ 17 ప్రభాతవార్త:** మూడవ విడతలో జరిగిన పంచాయితీ ఎన్నికలలో జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్ లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థిగా పోటీ చేసిన నిర్మల బాల స్వామి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్ గ్రామం జడ్చర్ల పట్టణానికి చేరువలోనే ఉంటుంది. సుమారు రెండున్నర వేలు జనాభా కలిగిన ఈ గ్రామంలో జడ్చర్లలో బీఆర్ఎస్ ముఖ్యనేతల్లో ఒకరుగా కొనసాగుతున్న ప్రణీల్ చందర్ గత ఐదేళ్లుగా గ్రామ సర్పంచ్ గా ఉన్నారు. గతంలో వారి కుటుంబం నుంచే సర్పంచులుగా కొనసాగడంతో కొత్త దనం కోరుకున్న ప్రజలు బాతస్వామికి పట్టం కట్టారు. భవన నిర్మాణ మేస్త్రీగా పని చేసే బాలస్వామి ఆర్థికంగా బలంగా లేకపోయినా గతంలోనూ పంచాయితీ ఎన్నికల్లో కేవలం కేవలం 74 ఓట్ల తేడాతో ఓడిపోయారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి బాలస్వామి పరిస్థితిని గమనించి ఆయనకు సహకరిస్తూ వచ్చారు. ఊరికి సబ్ స్టేషన్ తో సహా రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే వచ్చిన పంచాయితీ ఎన్నికలలో నస్రుల్లాబాద్ బీసీ మహిళకు రిజర్వ్ కాగా కాంగ్రెస్ అభ్యర్థిగా బాలస్వామి భార్య నిర్మల పోటీలోకి దిగగా, ప్రణీల్ చందర్ తన భార్య హేమలతను బరిలోకి దింపారు. జడ్చర్లలో కాంగ్రెస్ ఏ గ్రామంలో గెలిచినా నస్రుల్లాబాద్ లో మాత్రం గెలవలేదనే పరిస్థితులు మొదట్లో కనిపించినా ఆ తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో పాటుగా ఏకంగా ఎమ్మెల్యేనే రంగంలోకి దిగి ప్రచారంతో ఈ పరిస్థితులు మారిపోయాయి. అనూహ్యంగా 524 ఓట్ల మెజార్టీతో నిర్మల బాలస్వామి సర్పంచుగా విజయం సాధించారు.




నిర్మలా బాలస్వామి

## చలికాలంలో వరి నారుమడికి ప్రత్యేక జాగ్రత్తలు

**మద్దూరు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్**

**మద్దూరు,డిసెంబరు 17 ప్రభాతవార్త :** మద్దూరు మండలంలోని వివిధ గ్రామాల్లో చలికాల ప్రభావం పెరగడంతో వరినారుమడులకు నష్టంకలగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ సూచించింది. ఉష్ణోగ్రతలు తగ్గడం,గాలిలో తేమశాతం అధికంగా ఉండటంవల్ల నారుమడి ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పడే తీవ్రమైన చలి వల్ల నారుమడి బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. నారుమడిపై చలి గాలులు నేరుగా తాకకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, నీటి నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు.వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే పంట నష్టం నివారించవచ్చని తెలిపారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ మద్దూరు విస్తరణ అధికారులను సంప్రదించాలని వ్యవసాయ శాఖ కోరింది.



వరి నారుమడి

# ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

**ఉప్పునుంతల, డిసెంబరు 17 ప్రభాతవార్త :** మండలంలో పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 26 గ్రామపంచాయతీలు,198 వార్డు లకు మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చలి తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ పోలింగ్ కేంద్రాలకు భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చారు. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, వికలాంగులు వారి కుటుంబ సభ్యుల సహాయంతో వచ్చారు. దీంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 11 గంటలకు 52 శాతం పోలింగ్ నమోదైంది. ఒంటిగంట వరకు మొత్తం 87.3శాతం పోలింగ్ నమోదైంది. దీంతో మండలంలో సందడి ఎక్కువ కనిపించింది. 30,876 మంది ఓటర్ల గాను 13087 పురుషులు,13489 మంది స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 26,576ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 87.3 శాతం నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా క్యూ కట్టారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు పట్టణాల ఉన్న ఓటర్లు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఓట్లు వేసేందుకు క్యూ లైన్ లో నిల్చున్న ఓటర్లు

**బిఎల్ఓలను తిరస్కరించిన పోలీసులు...**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉండి ఓటర్ స్లిప్పులను అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ అందుబాటులో ఉండాలని ఆదేశాల మేరకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయకుండా స్థానిక పోలీసులు పోలింగ్ కేంద్రం వద్ద ఉండకుండా నిరాకరించడంతో బిఎల్ఓలు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయకుండా పోలీసులు ఆంక్షాలు విధించారు. ఉప్పునుంతల పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల ఆంక్షలతో బిఎల్ఓ లు సక్రమంగా పంపిణీ చేయలేకపోయారు. దీంతో ఓటర్లు ఓటర్ స్లిప్పుల కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.



ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు

## శ్రీ యోగ నృసింహ స్వామిని దర్శించుకున్న భక్తులు

**ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు**

**గద్వాల టౌన్ డిసెంబర్ 17, ప్రభాతవార్త :** ధనుర్మాస పూజల సందర్భంగా సాధారణంగా దేవాలయం వాస్తు అనేది మూల మూర్తులు యే దిక్కుకు తిరిగి ఉంటారో ఆ దిక్కుకు ఉన్న ప్రాధాన్యత బట్టి ఉంటుంది. సర్వ సాధారణంగా దేవాలయాల్లో మూల వర్లు తూర్పుకు తిరిగే ఉంటారు, దీనికి భిన్నంగా పడమర, ఉత్తరం, దక్షిణంకు మూల వర్లు వెంచేయడం ఒక ప్రత్యేక వాస్తు శైలి అని అనుకోవచ్చు, మనకు అలంపూర్ లో ఉన్న అన్ని ఆలయాలను గమనిస్తే అన్ని తూర్పు దిక్కుకే ఉన్నాయి, కానీ ఉత్తరం వైపు స్వామి వారు తిరిగి ఉన్నది.యోగ నృసింహ స్వామి ఆలయం:పడమర /దక్షిణం దిక్కుకు తిరిగిన దేవతలు తొందరగా కోరికలు తీరిస్తే, ఉత్తరం వైపు ఉండే దేవతలు కోరికలు లేకుండా ఉండే ముక్తి స్థితిని ప్రసాధిస్తారు అని శిల్ప శాస్త్రం, అందులో జంతు ముఖం ఉండే దేవతలు ఇలా ఉత్తర దిక్కుకు ఉంటే అనుగ్రహం ఇంకా శీగ్రంగా కలుగుతుంది, ఈ దేవాలయం వైష్ణవ, శైవ, శక్త తత్వముల కలియిక అని చెప్పుకోవచ్చు ఇక్కడ ప్రధాన దైవం శ్రీయోగ నృసింహ స్వామి వీరికి అశేష పరివార దేవతలు ఉన్నారు స్వామికి కుడివైపు విష్ణుదుర్గఎడమ వైపు చాకమ్మ(భక్తురాలు? యోగిని?), స్వామికి ఎదురుగ వాహనం స్థానంలో భక్తఆంజనేయ స్వామి దేవాలయం లోకి ప్రవేసించగానే మనకు కుడి వైపు..శ్రీభూ సమేత శేష షాయి (రంగనాధుడు), ఎడమ వైపు విశ్వక్సెనులు, ఆల్వార్లు, గణపతి, దర్శనం ఇస్తారు. ఈ దేవాలయం ప్రదక్షిణ మార్గంలో అశ్వార్ధ వృక్షం (రావి చెట్టు), పక్కనే ఉన్న ఇంకో ప్రాంగణంలో ఉత్తరాభి ముఖం శివ లింగం (తత్ పురుష ముఖం)దర్శనం ఇస్తాయి, దేవాలయం ప్రాంగణంలో పెద్ద తులసి కోట ప్రత్యేక ఆకర్షణ:ద్వార పాలకులు లేని ద్వారాలు ఇక్కడ గమనిస్తే ప్రధాన ద్వారం కు ఇరు వైపుకు శంఖ, పద్మ నిధులు ద్వార దేవతలుగ ఉంటారు ఇలా మనకు తిరుమల మహా ద్వారం వద్ద కూడా ఉంటారు, ఇదే అలంపూర్ లోని కూడాలి సంగమం దేవాలయం లో కూడా వీరు ఇలా ద్వారానికి రెండు వైపులా ఉండడం చూడవచ్చు నిత్యం ఉత్తర ద్వారం దర్శనం మనం పైన చెప్పుకున్నట్లు ఇక్కడ స్వామి ఉత్తరం దిక్కుకు ఉండడం విశేషం అయితే ఇక్కడ లోనికి వెళ్లే ద్వారం కూడా ఉత్తర ద్వారం అవ్వడం మరి విశేషం, సాధారణంగా విష్ణు దేవాలయం లో ఏడాదిలో ఒక్కరోజు అది వైకుంఠ ఏకాదశి ఒక్కరోజే ఈ ఉత్తర ద్వారం దర్శనం ఉంటుంది కానీ ఇక్కడ ప్రతి రోజు ఉత్తర ద్వార దర్శనం ఉండడం వల్ల ఇది మోక్ష స్థానం అని చెప్పవచ్చు స్వామి మూల మూర్తి ప్రత్యేకతలు..యోగ పట్టంలో ఉండే స్వామి నాలుగు చేతులు కలిగి పై రెండు చేతుల్లో చక్రం, శంఖం, ఖేచారి ముద్ర తో, కుడి ఎడమ వైపు శ్రీ, భూ దేవులు పాద పీఠం వద్ద గరుడ కలిగి ఉంటారు ఇది అత్యద్భుత యోగ మూర్తి, ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలు విశేషాలు తన సొంతం చేసుకొని విరాజిల్లుతున్న ఈ ఆలయాన్ని పవిత్రమైన ధనుర్మాసము సందర్భంగా భక్తులు, గ్రామం వాసులు తప్పకుండ దర్శించి స్వామి వారి అనుగ్రహం పొంది తరించగలరని కోరారు .



ఆలంపూర్‌లో ప్రసిద్ధి చెందిన యోగ నృసింహా స్వామి విగ్రహం

## జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు విజయవంతం

**-ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ అభినందనలు,**

**-నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 17 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో 453 గ్రామపంచాయతీలకు మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా,పారదర్శకంగా, విజయవంతంగా ముగిసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అధికారులను,సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, అలాగే ఓటర్లు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయడం వల్ల నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించగలిగామని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ ప్రక్రియలో జిల్లా ప్రజలు చూపిన బాధ్యతాభావం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారంతో జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.జిల్లాలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 22వ తేదీన సర్పంచుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించ నున్నట్లు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతలు స్వీకరించి, ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామపంచా యతీల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.



జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**శ్రీరంగాపూర్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** బుధవారం వనపర్తి జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా శ్రీరంగాపూర్ మండల పరిధిలోని వెంకటాపురంలో ఏర్పాటుచేసిన మోడల్ పోలింగ్ కేంద్రం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఐదు మండలాలలో ప్రశాంతంగా ప్రారంభమయ్యామని తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ అమూల్యమైన ఓటును ప్రశాంతంగా వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధ ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్

## పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ

**శ్రీరంగాపూర్,డిసెంబరు 17 ప్రభాతవార్త :**మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో శ్రీరంగాపూర్, వెంకటాపూర్ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సునీత రెడ్డి బుధవారం స్వయంగా పర్యవేక్షిస్తూ పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి కేంద్రంలో భద్రత ఏర్పాట్లు కట్టిదిట్టంగా అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లు భయభ్రాంతులకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసులు పూర్తిస్థాయి భద్రతను కల్పిస్తున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉందని ఐదుగురు అంతకన్నా ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రత్యేక పోలీసింగ్ కొనసాగుతుందని చట్టాన్ని అతిక్రమించే ప్రయత్నాలకు తావివ్వబోమని హెచ్చరించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించే ప్రజాస్వామ్య పండుగను ప్రశాంతంగా గౌరవప్రదంగా ముగించేందుకు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ

## శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కల్వకుర్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త:**లయన్స్ క్లబ్ కల్వకుర్తి, ఆమనగల్లు, జిల్లా అందత్వ నివారణ సంస్థ, రామ్‌రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్య చికిత్స శిబిరాలాను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శివరాం, కంటి వైద్య సహాయకులు వెంకటేష్, లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు శ్రీధర్‌లు కోరారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని డిప్యూటీ డిఎంహెచ్వో కార్యాలయ ఆవరణలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ శివరాం ప్రారంభించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాత్ర ఎంతో గొప్పదన్నారు. కంటితో పాటు అనేక వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతోమందికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు కంటి ఆపరేషన్లు నిర్వహిస్తూ ప్రత్యేక స్థానం దక్కించుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు బావండ్ల వెంకటేష్ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 64 మందికి పరీక్షలు నిర్వహించగా 16 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో మెంబర్షిప్ కమిటీ చైర్మన్ గుబ్బ కిషన్, మాజీ కోశాధికారి గోవిందు శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి దారామోని గణేష్, మేకల శ్రీనివాస్, బావండ్ల మధు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీ తిమ్మప్ప స్వామికి వెండి వితరణ



ఆలయ చైర్మన్ కి వెండి ఇస్తున్న భక్తులు

**మల్దకల్ డిసెంబర్ 17, ప్రభాతవార్త :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహాలకు 108 కేజీల వెండితో వెండి కవచాలు తయారు చేయడానికి గాను వెండిని సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా కోడుమూరు గ్రామానికి చెందిన మాచర్ల చంద్రిక కుటుంబ సభ్యులు 211 గ్రాముల వెండిని దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావుకు అందజేశారు. దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దాతలకు స్వామివారి శేష వస్త్రం స్వామి వారి చిత్రపటం ప్రసాదం బహూకరించారు.


## నూతనంగా గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు అభినందనలు

**మాజీ యూత్ ప్రెసిడెంట్ అర్జున చారి**

**దేవరకద్ర,డిసెంబరు17 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థులు కాంగ్రెస్‌పార్టీ కోసం కష్టపడ్డ వారికి అవకాశం ఇచ్చిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి మాజీ యూత్ ప్రెసిడెంట్ అర్జున చారి అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నూతనంగా గెలిచిన సర్పంచ్‌లకు, ఉపసర్పంచ్‌లకు, వార్డ్‌మెంబర్లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్జున చారి మాట్లాడుతూ గ్రామంలో సర్పంచ్‌లు కష్టపడి పనిచేసి, గ్రామాభివృద్దే ధ్యేయంగా ప్రజల మన్ననలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

**అమరచింత డిసెంబర్ 17, ప్రభాతవార్త :** అమరచింత మండలంలోని ధర్మాపూర్ గ్రామానికి చెందిన కురువ నరసప్ప గత నెల 28 న ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లారని 20 రోజులుగా అనేక ప్రాంతాలలో తిరిగిన తెలియడం లేదని ఆయన కుమారుడు కురువ శివ తెలిపారు. తండ్రి అదృశంపై అమరచింత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై కేసు నమోదు దర్యాప్తు చేస్తామని ఎస్సై స్వాతి తెలిపారు.




నరసప్ప (ఫైల్)

## కౌకుంట్ల గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు

**దేవరకద్ర, డిసెంబరు 17 ప్రభాతవార్త:** ఒకటో వార్డ్ మెంబర్‌గా నన్ను ఆశీర్వదించి, గెలిపించిన సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు కంసలీ సునీత తెలియజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటో వార్డులో చిన్న సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకొస్తే మీ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను త్వరగా పరిష్కరించే విధంగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సర్పంచ్‌గా ఉల్లి నరేష్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించిన కౌకుంట్ల ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

**వెల్దండ, డిసెంబర్ 17 ప్రభాతవార్త:**మండల కేంద్రానికి చెందిన గంగాపురం పార్వతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య బాదిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, నాయకులు ప్రభాకర్, కృష్ణారెడ్డి నిరంజన్, నాగయ్య, రవికుమార్, యాదగిరి, పాండు, శేఖర్, ప్రవీణ్, భాస్కర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## మండలంలో గెలుపొందిన సర్పంచులు

**ఉప్పునుంతల, డిసెంబరు 17 ప్రభాతవార్త :** మండలంలో బుధవారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన గ్రామ సర్పంచుల వివరాలు ఇలా ఉన్నాయి. అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ గా జిల్లెల్ల జగత్ రెడ్డి (కాంగ్రెస్), సీబీ తండా రమావత్ జ్యోతి (కాంగ్రెస్), దాసర్లపల్లి గ్రామ సర్పంచ్‌గారమేష్‌రెడ్డి (కాంగ్రెస్ రెబల్), దేవదారికుంటతండా గ్రామ సర్పంచ్ మూనావత్ మంగమ్మ (కాంగ్రెస్), కేతావత్ చిట్టి ఈరట్వాన్ పల్లి (కాంగ్రెస్), గువ్వలోని పల్లి గ్రామ సర్పంచ్ గా పానుగంటి శ్రీదేవి (కాంగ్రెస్), కంసాని పల్లి సర్పంచ్ చీమర్ల లలిత (కాంగ్రెస్ రెబల్), కంసాని పల్లి తండా సర్పంచ్ వాల్యా నాయక్ (కాంగ్రెస్), కొరటికల్ సర్పంచ్ ఆర్కపల్లి జగతమ్మ (కాంగ్రెస్), లత్తి పూర్ గ్రామ సర్పంచ్ మూనావత్ మున్యా (బిఆర్ ఎస్), లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్‌గా బిషం గోపాల్ ( బిఆర్ ఎస్), మామిళ్ళపల్లి గ్రామ సర్పంచిగా మొకురాల మోహన్ గౌడ్ (కాంగ్రెస్), మర్రి పల్లి గ్రామ సర్పంచిగా సత్తు భూపాల్‌రావు ( బిఆర్‌ఎస్), మొల్గర గ్రామ సర్పంచిగా శ్రీపురం సులోచనమ్మ ( బిఆర్‌ఎస్), పెద్దాపూర్ గ్రామ సర్పంచ్‌గా వంగ సాయిబాబా ( బిఆర్ ఎస్), పెనిమెళ్ళ గ్రామ సర్పంచ్ గా మేడసాని శ్రీలత విజయేందర్ రెడ్డి ( కాంగ్రెస్), పిరట్వాన్ పల్లి గ్రామ సర్పంచ్ గా విరోజు సుప్రియ (కాంగ్రెస్), సూర్య తండ గ్రామ సర్పంచిగా రత్లావత్ మోత్యా (బిఆర్ ఎస్), రాయి చేడు గ్రామ సర్పంచ్‌గా లలిత (కాంగ్రెస్), తాడూరు గ్రామ సర్పంచ్ గా ఏలేటి అలివేలమ్మ (కాంగ్రెస్), సూర్య తండా నారాయణ ఏకగ్రీవం( కాంగ్రెస్), తిప్పాపూర్ గ్రామ సర్పంచిగా రాజపుత్ర మహేష్ సింగ్ (కాంగ్రెస్), తిరుమలాపురం గ్రామ సర్పంచ్ గాబర్గెల శ్రీకాంత్(కాంగ్రెస్), ఉప్పరి పల్లి గ్రామ సర్పంచ్‌గా బొజ్జ గీత అమరేందర్ రెడ్డి (కాంగ్రెస్ రెబల్), ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ గా చింతగాళ్ళ శ్రీనివాసులు (కాంగ్రెస్), వెల్టూరు గ్రామసర్పంచ్‌గా చింతోజు వెంకటేష్ ( బిఆర్‌ఎస్), సదవుడు గ్రామ సర్పంచ్‌గా బీంపాకుల గెలవమ్మ (బిఆర్‌ఎస్)లుఎన్నికైనట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి ఎంపిడిఓ వరుణ్ తేజ తెలిపారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకు గాను ఒక గ్రామపంచాయతీ సూర్య తండా సర్పంచ్ ఏకగ్రీవం కాగా 26 గ్రామ పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో 15 కాంగ్రెస్, 8 బిఆర్‌ఎస్, ముగ్గురు కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థులు గెలుపొందారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీ సర్పంచ్‌గా చింత గాళ్ళ శ్రీనివాసులు అత్యధికంగా 1200 పైబడి మెజార్టీతో గెలుపొందగా, అత్యల్పముగా పెనిమిళ్ళ , మామిళ్ళపల్లి గ్రామ సర్పంచులు ఎన్నికయ్యారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులు

**శ్రీరంగాపూర్, డిసెంబరు17 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో బుధవారం మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు: 1) కంబాల పూర్ విజయ్ రెడ్డి (టిఆర్‌ఎస్ ) 2) నగరాల మహాదేవ్ (కాంగ్రెస్) 3) నాగసానిపల్లి సుజాత రాజశేఖర్ (కాంగ్రెస్) 4) వెంకటాపూర్ భారతీ ఎల్లయ్యగౌడ్ ( కాంగ్రెస్) 5) జానంపేట రాముడు (కాంగ్రెస్) 6) తాటిపాముల శిరీష మధు (స్వతంత్ర అభ్యర్థి) 7) షేర్ పల్లి వెంకటయ్య యాదవ్ ( కాంగ్రెస్) శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఇంకా ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది.

## చిన్నపల్లిలో మూడో స్థానానికి పరిమితమైన కాంగ్రెస్

◆ 249 ఓట్లతో బిఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త కాపు విష్ణువర్ధన్ రెడ్డి విజయం



**జడ్చర్ల, డిసెంబర్17 ప్రభాతవార్త:** మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గం లోని చిన్న పల్లి గ్రామపంచాయతీలో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు మూడవ స్థానానికి పరిమితం కావడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే జడ్చర్ల మండలంలోని చిన్నపల్లి గ్రామంలో మొత్తం446 ఓటర్లున్నారు. కాగా మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ మద్దతుదారుడు విష్ణువర్ధన్‌రెడ్డికి 249 ఓట్లురాగా, రెండోస్థానంలో బీజేపీ మద్దతుదారుడుకి 120 ఓట్లు వచ్చాయి. ఇదిలా ఉండగా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థికి 48 ఓట్లు మాత్రమే రావడం చర్చనీయాంశంగా మారింది.

## మీరే సజీవ గ్రంథాలయాలు

(మొదటి పేజీ తరువాయి)

ధ్యేయమని, పెన్షన్లు, వైద్య సౌకర్యాలు, ఇతర సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తన తలుపులు తెరిచి ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గండీడ్ మండలానికి చెందిన అనాథ పిల్లల సంరక్షణ కోసం 50 వేల రూపాయలను ఎమ్మెల్యే సమక్షంలో చిన్నారులకు రిటైర్డ్ తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రిటైర్డ్ ఉద్యోగులు ఎం. సాయిలుగౌడ్, బి. ప్రభాకర్, ఎ. ప్రభాకరాచారి, కె. అంజిలయ్య చారి, జగపతి రావు, బి. శ్రీనివాసులు, ఉద్యోగ సంఘాల నేతలు యుండి రమేష్ కుమార్, జి. రాజీవ్ రెడ్డి, ఆర్ చంద్రనాయక్, విజయ్‌కుమార్, వరప్రసాద్, కె. రాజయ్య, ఎన్. శంకరయ్య, ఎ. నరేందర్, నాగభూషణం పెన్షనర్ల సంఘం నాయకులు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ శాఖలకు చెందిన పదవీ విరమణ చేసిన అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## పోల్కంపల్లి సర్పంచ్ అంకు నారమ్మ గోపాల్‌ను ఘనంగా సన్మానించిన కేటీఆర్, హరీష్ రావు



**నాగర్‌కర్నూల్ ,డిసెంబర్17 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలం పోల్కంపల్లి గ్రామంలో బిఆర్ యస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అంకు నారమ్మ గోపాల్ ఘన విజయం సాధించిన సందర్భంగా మాజీ ఐటి శాఖ మంత్రి కేటీఆర్ , మాజీ మంత్రి హరీష్ రావు ఈరోజు హైదరాబాద్ లోని తమ తమ నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావు మాట్లాడుతూరెండు సంవత్సరాలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుంది మిగతా మూడు సంవత్సరాలు మన కేసీఆర్ గవర్నమెంట్ వస్తుంది మీరు ధైర్యంగా పనిచేయండి మీకు ఏ సమస్య వచ్చినా నేనున్నానని ధైర్యం చెప్పారు అంకు సురేందర్ నీవు ఇచ్చిన హామీలను మేము నెరవేర్చే విధంగా మీకు తోడుంటానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు డొక్కు పరశు రాములు తాడెం రవి మీసాల శ్రీకాంత్ చీమర్ల భాస్కర్ రెడ్డి, భోజరాజు శ్రీనివాసులు, నరేందర్ గౌడ్, సల్వాది అశోక్ కుమార్ , ఆబేదా బేగం, సయ్యద్ నిజాముద్దీన్, పుప్పాల రవీందర్, కదారి మల్లయ్య, డొక్కు వెంకటయ్య, వేముల గోపాల్, ఎండి ముజాహిద్, డొక్కు సాయిలు, కొల్లే శేఖర్, సుర్వి కురుమయ్య, కొమ్మురాజు, రాగం రవి ,రాగం సాయిబాబు సయ్యద్ మహమూద్ , జూపల్లి శ్రావణ్, ఎస్.కె కాజా, బొడ్డుపల్లి శ్రీశైలం, కేశమోని సాయికుమార్ పోల్కంపల్లి బిఆర్ యస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది...

## ఎన్నికల్లో హస్తం హవా



**- మక్తల్ లో ఐదు మండలాల్లో మెజారిటీ**

**- ఫలితాలపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్, డిసెంబర్17, ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలో జరిగిన మూడవ దశలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధించడంపట్ల పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. మూడవ దశలో నియోజకవర్గంలో 5 మండలాలకు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మెజారిటీ స్థానాలు సాధించారు. రెండవ దశలో జరిగిన ఎన్నికల్లో నూ ఆత్మకూరు, అమరచింతమండలాల్లోని మెజారిటీ స్థానాలుసాధించడం జరిగింది. ఈ సందర్భం గా గెలిచిన వారికి మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలియచేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి పల్లె అభివృద్ధి చేయాలని కాంక్షిస్తున్న ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకొని వెళ్తూ, గెలిచినవారు అందరూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం మక్తల్ పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాల్లో గెలిచిన వార్డు సభ్యులు, సర్పంచ్లను మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించనున్నారు.

## ఓటుహక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన సతీమణి ఆల మంజుల ఇతర కుటుంబ సభ్యులు కలిసి పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆలమాట్లాడుతూ మండలంలోని చాలా మటుకు గ్రామ పంచాయతీలను బీఆర్‌ఎస్ గెలుచు కుంటుందని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రజలు విసిగారని విమర్శించారు.



అన్నాసాగర్‌లో ఓటుహక్కు వినియోగించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్ మండలంలో

# జీపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే పైచేయి

◆ 14లో ఏడుగురు కాంగ్రెస్, ఏడుగురు బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు

◆ మండలంలో తొలిబోణి కొట్టిన ఎల్‌కె తండా సర్పంచి ఎస్ మాన్యనాయక్

◆ అన్నాసాగర్‌లో సర్పంచ్‌తో సహా 10వార్డులను క్లీన్‌స్వీప్ చేసిన బీఆర్‌ఎస్

◆ గెలిచినవారిలో నలుగురు మహిళా సర్పంచులు..



**భూత్పూర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలో బుధవారం జరిగిన మూడో విడత సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికల్లో చేయి, కారు గ్రామ బాసుల పదవుల్లో చెరి సగం సీట్లు వచ్చాయి. అధికార పార్టీ కాంగ్రెస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థులు ఏడుగురు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థులు ఏడుగురు గెలుపొందారు. హస్తం, కారు సెరిసగం తమ ఖాతాల్లో వేసుకున్నాయి. భూత్పూర్ మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు, 130 వార్డులకుగాను ఐదు గ్రామపంచాయతీల సర్పంచులు (భట్టుపల్లి, ఏఆర్‌కాలనీ, పెద్దతండా, తాటి కొండ, చౌలతండా) లతో పాటు 44మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. మిగిలిన 14జీపీలు, 130వార్డులకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామం అన్నాసాగర్‌లో సర్పంచిగా బీఆర్‌ఎస్ బలపరిచిన ఆల శ్రీకాంత్‌రెడ్డితో పాటు జీపీలో ఉన్న పదివార్డులలో బీఆర్‌ఎస్ బలపరిచిన వార్డు సభ్యులే గెలిచి క్లీన్‌స్వీప్ చేసి మండలంలోనే ప్రభంజనం సృష్టించారు. బీఆర్‌ఎస్ బల పరిచిన ఆల శ్రీకాంత్‌రెడ్డి మండలంలోనే అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిచిన ఏకైక సర్పంచిగా రికార్డు సృష్టించారు. ఇక మండలంలోని లంబడి కుంట తండాలో సర్పంచిగా బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి ఎస్ మాన్యనాయక్ గెలిచి బీఆర్‌ఎస్‌కు తొలి బోణి కొట్టారు. గెలిచిన సర్పంచులలో నలుగురు మహిళా సర్పంచులు ఎన్నికయ్యారు. ఏకగ్రీవంలో కూడా నలుగురు మహిళా సర్పంచులు ఎన్నికకాగా, భూత్పూర్ మండలంలో ఎన్నికైన మహిళా సర్పంచుల సంఖ్య ఎనిమిదికి చేరింది. జీపీలలో గెలిచిన సర్పంచి, ఉపసర్పంచి, వార్డు సభ్యులకు ఈ నెల 22న మండల అధికారులు గెలుపు పత్రాలు అందజేస్తారు.

**గెలిచిన సర్పంచుల వివరాలు :**

**బీఆర్‌ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు**

| | |
|---|---|
| 1) లంబడికుంటతండా | (ఎస్ మాన్యనాయక్) |
| 2). అన్నాసాగర్ | (ఆల శ్రీకాంత్‌రెడ్డి) |
| 3). తాటిపర్తి | (హబీబునిస్సాబేగం) |
| 4). శేర్పల్లి(బి) | (రాచమోని చంద్రకళ) |
| 5). రావులపల్లి | (తొండ శ్రీశైలం) |
| 6). కొత్తూరు | (గొడుగు జంగమ్మ) |
| 7). మద్దిగట్ల | (నత్తి సురేష్) |

**కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు**

| | |
|---|---|
| 8). కొత్తమొల్గర | (మలిశెట్టి వెంకటేష్) |
| 9). పాతమొల్గర | (ఎర్ర పెద్దనాగయ్య) |
| 10). హస్నాపూర్ | (తాళ్లగడ్డ సంజీవరెడ్డి) |
| 11). పోతులమడుగు | (గంగుల ఆనంద్‌రెడ్డి) |
| 12). వెల్కిచర్ల | (జమాల్‌పూర్ రమేష్) |
| 13). కరివెన | (కరివెన నాగజ్యోతి) |
| 14). కప్పెట | (జి మాసగౌడ్) |

**ఏకగ్రీవ సర్పంచులు**

| | |
|---|---|
| 15). ఏవీఆర్ కాలనీ | (పాత్లావత్ తారునాయక్) |
| 16). భట్టుపల్లి | (లక్ష్మమ్మ) |
| 17). చౌలతండా | (కొర్ర మణి) |
| 18). పెద్దతండా | (ఉడుత్యావత్ సుశీల) |
| 19). తాటికొండ | (తాటకొండ కల్పనారెడ్డి) |

# బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి.రజని**



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి. రజని

**పెబ్బేరు, డిసెంబరు17 ప్రభాతవార్త:** బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో బాలికల మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి విద్యార్థులకు నాల్స (లీగల్ సర్వీసెస్ టు విక్టిమ్స్ ఆఫ్ యాసిడ్ ఎటాక్) స్కీమ్, 2016, గృహహింస నిరోధక చట్టం, వరకట్న నిషేధచట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఫోక్సో చట్టం, మోటార్ వాహనాల చట్టంపై అవగాహన కల్పించారు. అదే విధంగా కార్యక్రమంలో విద్యార్థులు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నాటికలను ప్రదర్శించారు. పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికను ఏర్పాటు చేసుకుని పరీక్షలకు చదవడం వలన మంచి మార్కులు సాధించవచ్చని సూచించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కృష్ణయ్య కళాశాల ప్రధానోపాధ్యాయులు జైచంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకవిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

## ఉమ్మడి మండలంలో పోటాపోటిగా గెలిచిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల సర్పంచ్ అభ్యర్థులు

◆ 949 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన కొండేరు సర్పంచ్ అభ్యర్థి వీరన్న



షేక్‌పల్లి సర్పంచుగా గెలుపొందిన వెంకట లచ్చమ్మ



ఎర్రవల్లి సర్పంచ్‌గా గెలుపొందిన యు. అనిత

**ఇటిక్యాల డిసెంబర్17 ప్రభాతవార్త:** ఉమ్మడి ఇటికాల మండలంలో 29 పంచాయతీలు ఉండగా ఇప్పటికే మూడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం 3వ విడతలో సర్పంచులకు. వార్డు మెంబర్లకు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకుఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం అనంతరం అధికారులు ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. సాయంత్రం 8 గంటల దాకా కౌంటింగ్ కొనసాగి ఫలితాలు ప్రకటించారు. దీంతో ఉమ్మడి మండలంలో వయా గ్రామాలలో గెలిచిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీ..బి ఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు పోటాపోటిగా గెలుపొందారు. ఇటిక్యాల మండలంలో అన్ని మునగాల సర్పంచ్‌గా కొప్పుల ప్రభాకర్ రెడ్డి. గోపాల్‌దిన్నెలో వెంకటేశ్వరమ్మ. ఉదండాపురంలో గొల్ల మహేష్ యాదవ్, శనగపల్లి చిట్టెమ్మ, నక్కలపల్లి రాజకుమార్, చాగాపురం సావిత్రమ్మ, షాబాద్ లో డేవిడ్. బుడ్డా రెడ్డి పల్లి లో సావిత్రి, శివనంపల్లి లక్ష్మన్న, సాతర్ల అంజమ్మ, పెద్దదిన్నెలో సుజాత, ఇటిక్యాలలోజీవన్‌రెడ్డి సర్పంచ్ అభ్యర్థులుగా గెలుపొందారు. అలాగే కొత్త ఎర్రవల్లి మండలంలో షేక్ పల్లి వెంకట లచ్చమ్మ. తిమ్మాపురం కల్పన. కోదండపురం రజని. జింకలపల్లి టీ. మద్దిలేటి. వీరాపురం చిన్న సంజీవ నాయుడు. కొండేరు వీరన్న. బీచుపల్లి విజిత బీసి రెడ్డి. బట్లదిన్నె దేవమ్మ. ధర్మవరం వెంకటేశ్వరమ్మ. ఎర్రవల్లి యు అనిత. శాసనూలు రేణుక. పుటాన్‌దొడ్డి సర్పంచ్‌గా గొల్ల చిన్న నారాయణ. వల్లూరు సర్పంచ్‌గా రవి ప్రకాష్ గెలుపొందనున్నారు. గెలిచిన సర్పంచులకు. వార్డు మెంబర్లకు ప్రిసైడింగ్ అధికారులు నియామక పత్రం అందజేశారు. అదేవిధంగా గ్రామాలలో గెలిచిన సర్పంచులను, వార్డు మెంబర్లను అభిమానులు ఊరేగించి సంబరాలు జరుపుకున్నారు.

# ఎన్నికలను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ డి జానకి



జానంపేటలో పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ

**భూత్పూర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** జిల్లాలో మూడో విడతగా బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలను జిల్లా ఎస్పీ డి జానకి ఐపీఎస్ పోలీస్ కేంద్రాలవద్ద పోలీసులు చేపట్టిన బందో బస్తు చర్యల్ని పర్యవేక్షించారు. ఎస్పీ ఎన్నికలు జరిగిన అడ్డాకుల ,మూసాపేట, భూత్పూర్, బాలానగర్, జడ్చర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో పోలీస్ బందోబస్తు చర్యల్ని పర్యవేక్షించారు. అడ్డాకుల మండలంలోని కందూరు, మూసాపేట మండలం జానంపేట, భూత్పూర్ మండలం అన్నాసాగర్, బాలానగర్ మండలంలోని ఉడిత్యాల, గంగాధర్‌పల్లి, మోతీ ఘనపూర్‌లతో పాటు జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామాల్లో జరిగిన ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ వెంట డీఎస్పీ సీఐడీలు శ్రీనివాస్ రావు, సంపత్ కుమార్, భూత్పూర్ పోలీస్ సీఐ రామకృష్ణ, ఎస్సై చంద్ర శేఖర్‌లతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు న్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డి జానకి మాట్లాడుతూ ఎన్నికలు ప్రజా స్వామ్యబద్ధంగా, శాంతియుతంగా, సజావుగా సాగేందుకు పోలీ సులు సహకరించి ఎప్పటికప్పుడూ అప్రమత్తత ప్రదర్శించాలని సూచించారు.



## పల్లె ప్రగతి వనంలో ఎండుతున్న చెట్లు

■ పట్టించుకోని అధికారులు



అల్వాలలో పల్లె ప్రకృతి ప్రకృతి వనంలో ఎండుతున్న చెట్లు

**పెద్దమందడి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో ఉన్న పల్లె ప్రగతి ప్రకృతి వనంలో చెట్లు ఎండిపోతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ప్రతి గ్రామంలోని పల్లె ప్రగతి, ప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. పల్లె ప్రగతి ప్రకృతి వనంలో ఉన్నచెట్లకు నీళ్ల పట్టకపోవడంతోవేసిన చెట్లు ఎండిపోతున్నాయి. పంచాయతీ అధికారి, ఫీల్డ్ అసిస్టెంట్ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లెప్రకృతి ప్రకృతి వనంలో చెట్లను ఎండిపోకుండా చెట్లకునీళ్ల పట్టేలాచూడాలనిపలువురు అంటున్నారు.

## శబరిమలకు బయలుదేరిన దొడగుంటపల్లి అయ్యప్ప స్వాములు



దొడగుంటపల్లి నుండి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

**పెద్దమందడి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు 41 రోజు దీక్షలు పూర్తిచేసుకుని బుధవారందొడగుంటపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర పడికాయలు కొట్టి వనపర్తి జిల్లా కేంద్రంలో రాజన్నగరం దగ్గర అయ్యప్పస్వామి ఆలయంలోఅయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఇరుముళ్ళు కట్టుకొని శబరి మల అయ్యప్పస్వామి దగ్గరకు బయలుదేరారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## గెలపొందిన నూతన సర్పంచ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, డిసెంబర్17 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని శంకర్ కొండ తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందిన ఇస్లావత్ రవీందర్ నాయక్‌తో పాటు వార్డు సభ్యులను హైదరాబాదులోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలక బాధ్యతని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని గ్రామాన్ని అన్ని రంగాల అభివృద్ధి పరిచేందుకు ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణ నాయక్ ఉపసర్పంచ్ పరమేశ్వరి మాజీ సర్పంచ్ రామకృష్ణ, రాజు యాదవ్, గోప్యానాయక్, కేశ్యానాయక్, ఝాన్సీ రాంనాయక్, రవి నాయక్ తదితరులున్నారు.

## కలెక్టరేట్‌లో ఫిర్యాదు



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**రాజాపూర్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామ శివారులో గల స్వర్గసీమ అమేయ అనే ఓ ప్రైవేట్ వెంచర్‌లో ఉన్న గుట్టలను ఎలాంటి అనుమతులు లేకుండా తొలగిస్తున్నారని బీజేవైఎం జడ్చర్ల నియోజకవర్గ కన్వీనర్ ఆదిత్య బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ గుట్టలు తొలగించడం వల్ల సమీప గ్రామాలైన తిరుమలాపూర్, రాఘవాపూర్ గ్రామ ప్రజలు కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉందని, అనుమతులు లేకుండా గుట్టలను తొలగిస్తున్న వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనట్లు ఆదిత్య తెలిపారు.

## కొమ్ముల గట్టు ఉత్సవాల సందర్భంగా భక్తులకు తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు



కొమ్ముల గట్టు దేవాలయం దగ్గర బోర్ మోటర్ బిగించిన శ్రీనివాస్‌రెడ్డి

**పెద్దమందడి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జంగమాయపల్లిలో వచ్చే నెల శ్రీ కొమ్ముల గట్టు స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా బుధవారం కొమ్ముల గట్టు దగ్గర ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర రూ. 50,000లతో 2హెచ్‌పి కొత్త మోటార్ పైప్ సెట్‌బోరు మోటర్ బిగించారు. భక్తులకు త్రాగు నీటి సమస్యలను పరిష్కరించారు. బాత్రూంలను నూతన గదులను నిర్మించారు. కొట్టుకూరి శ్రీనివాస్‌రెడ్డి బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పించారు. అదేవిధంగా భక్తులకు టాయిలెట్ నూతన గదులను నిర్మించారు. కొమ్ముల గట్టు జాతరలో ఏర్పాట్లకు తన వంతు కృషి చేశామని అన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు



**గద్వాల టౌన్ డిసెంబర్17, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డిని 11జిల్లాల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలు జిల్లాల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఎం సురేష్, కార్యదర్శి కృష్ణ, ట్రెసరర్ ప్రకభాకర్ రెడ్డిలు వున్నారు.

# మహబూబ్‌నగర్‌లో 88.36శాతం నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా మొత్తం 1152 వార్డు స్థానాలకు గాను 231 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.7 వార్డ్ లలో జీరో నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీటిని మినహాయిస్తూ, 914వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 1152 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎక్కడికక్కడ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ఏర్పాట్లు చేయడమే కాకుండా, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం, బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు..క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడం తో పాటు, వెబ్ క్యాస్టింగ్ జరిపించామని, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ తీరును నిశితంగా పరిశీలన చేశారని అన్నారు. కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ తీరును, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరిగిందన్నారు. మద్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగగా, నిర్ణీత సమయం లోపు క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించారుకౌంటింగ్



ప్రారంభంపోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రాల్లో మద్యాహ్నం 2 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలను వెల్లడించేలా విస్తృత చర్యలు చేపట్టారు.కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ననుసరించి కౌంటింగ్ కేంద్రాలలో వీడియో గ్రఫీ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ రికార్డ్ చేయడం జరిగింది.జడ్చర్ల మండలం గంగా పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి కౌంటింగ్ ప్రక్రియ పరిశీలించారు కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు ఈ సందర్భంగా సూచించారు.పోలింగ్,కౌంటింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు స్టేజ్ 1,2 ఆర్.ఓ.లకు,పి.ఓ.లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి మాస్టర్ ట్రైనర్ ల ద్వారా శిక్షణ అందించారు. సాధారణ ఎన్నికల పరిశీలకురాలు శ్రీమతి కాత్యాయని దేవి, ఐ. ఏ ఎస్ పోలింగ్ కేంద్రాలను,క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను,ఎప్పటి కప్పుడు సమావేశాల ద్వారా ఎన్నికల నిర్వహణ పై సూచనలు చేశారుజిల్లాలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి.డి జానకి లు పోలింగ్,కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన పటిష్ఠ చర్యల ఫలితంగా వారి సూచనలు మేరకు అధికారులు సమన్వయంతో మూడు దశల్లో నిర్వహించిన రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.





## పెబ్బేరులో 86.51 శాతం పోలింగ్

**పెబ్బేరు, డిసెంబరు 17 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం మూడో విడత ఎన్నికలలో భాగంగా బుధవారం జరిగిన 17 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ విజేతలు కంచిరావుపల్లి తండా కాంగ్రెస్ అభ్యర్థి బాలూనాయక్ 117 విజయం, గుమ్మడం తాండ కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి చిట్టెమ్మ 57 ఓట్లతో విజయం,ఈర్లదిన్నె సర్పంచ్ గా స్వాతంత్ర అభ్యర్థి బాలరాజు 13 విజయం,బుడిదపాడు సర్పంచ్‌గా మన్యం 69 కాంగ్రెస్ విజయం,బునియాదిపురం విజయ్ గౌడ్ టిఆర్ఎస్ 147 కోట్లతో గెలుపు, జనుంపల్లి నక్క పద్మ బిఆర్ఎస్ 115 గెలుపు, వైశాఖాపురం నిఖిత కాంగ్రెస్ అభ్యర్థి 548ఓట్లతో మెజార్టీ గెలుపు, పాతపల్లి చైతన్య భారతి టిఆర్ఎస్ 176 ఓట్లతో గెలుపు, తోమాలపల్లి అశోక్ కాంగ్రెస్ 12 ఓట్లతో గెలుపు, తిప్పాయిపల్లి రాముడు స్వాతంత్ర అభ్యర్థి 10 ఓట్లతో గెలుపు, అయ్యవారిపల్లి కురుమూర్తి 12 ఓట్లతో కాంగ్రెస్ గెలుపు, గుమ్మడం నాగేష్ బి ఆర్ ఎస్ అభ్యర్థి 471 గెలుపు, కొత్త సూపర్ గుల్ల పద్మ కాంగ్రెస్ 8 ఓట్లతో గెలుపు, స్వరాజ బాబు కాంగ్రెస్ 200 ఓట్లతో గెలుపు, కంచిరావుపల్లి అరుణ కాంగ్రెస్ అభ్యర్థి 790 మెజార్టీతో గెలుపు. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పర్యవేక్షి ంచి అధికారులకు సూచనలు తెలియజేశారు. పోలీస్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్ ఓ నిస్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.



వీల్ ఛైర్‌లో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధురాలు

## వైశాఖపురంలో వైద్య విద్యార్థిని గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

సర్పంచ్‌గా 548 భారీ ఓట్ల మెజార్టీతో గెలుపొంది అందరినీ ఆశ్చర్యపరిచారు. పెబ్బేరు మండలంలోని వైశాఖపురంలో మొత్తం 2749 ఓటర్లు ఉండగా, 2328 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ తో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థి మధ్య పోటీ నెలకొన్నది. కాకా నిఖికు 1022 ఓట్లు రాగా, రెండవ స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థి పి.లచ్చుమ్మ 474 ఓట్లు, బి.ఆర్.ఎస్ మద్దతు దారురాలు సుజాతకు 378 ఓట్లు వచ్చాయి. నికిత తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు. తండ్రి రాజేంద్ర ప్రసాద్ డిప్యూటీ తహసిల్దార్ గా విధులు నిర్వర్తిస్తుండగా అమ్మ విద్యాశాఖలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నది. నికిత ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లా వైద్య కళాశాలలో మూడవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్నది. 22 సంవత్సరాల అతి చిన్న వయసులో ఎంబీబీఎస్ చదువుతూ సర్పంచ్ గా గెలుపొంది అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. నికిత సర్పంచ్ గా గెలవడంతో గ్రామస్తులే కాకుండా తోటి విద్యార్థులు సైతం అభినందనలు తెలుపుతున్నారు



## ప్రత్యేక నిఘా

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక సదుపాయాల ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు, నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే పోలింగ్ అనంతరం జరిగే కౌంటింగ్ ప్రక్రియలో కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తిస్థాయి సిబ్బంది, భద్రతా బలగాలతో సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

## నేను పార్టీ మారలె..

(మొదటి పేజీ తరువాయి)

కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇతర మంత్రులను కలిశానని ఆయన స్పష్టం చేశారు. ఒక ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వాన్ని సంప్రదించడం సహజమైన ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు.స్పీకర్ నిర్ణయంపై స్పందన...గౌరవ స్పీకర్ అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ, రాజ్యాంగబద్ధంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. మేం పార్టీ మారలేదనే విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. గతంలో కూడా బిఆర్ఎస్ (అప్పటి టిఆర్ఎస్) అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ని కలిసిన సందర్భాలు ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్యంలో ఒక సాధారణ విషయం అని కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.బిఆర్ఎస్ నేతలపై విమర్శలు.కొందరు బిఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగానే తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. కోర్టులకు వెళ్లి లేని వివాదాలను సృష్టించడం బాధాకరమని అన్నారు. జడ్జిమెంట్ కాపీ పూర్తిగా అందిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తానని, తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన పునరుద్ఘాటించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారని, గతంలో తామిద్దరం జెడ్పీటీసీలుగా కలిసి పనిచేశామని, ఆ సాన్నిహిత్యంతోనే గద్వాల అభివృద్ధి కోసం కలిశానని ఆయన వివరించారు.

## పోలింగ్‌లో పోలీసు సాయం

**మహబూబ్‌నగర్ డిసెంబర్ 17 ప్రభాతవార్త :** మూడో దశ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఈ మేరకు మహబూబ్నగర్ జిల్లాలో ఎస్పీ జానకి ధరావత్ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. పోలీసులు అంటే కాఠిన్యమే భయమే కాదు.. సాయం లోనూ మేము ముందుంటాము అని మరోసారి నిరూపించారు. నడవలేని వాళ్ళకు పోలింగ్ కేంద్రంలో తీసుకురావడానికి సాయం అందించి తమ మంచి మనసును చాటుకున్నారు. మహబూబ్నగర్ జిల్లాలో పలుచోట్ల ఈ దృశ్యాలు దర్శనమిచ్చాయి.





## రోడ్డెక్కిన విద్యార్థులు

**నారాయణపేట. డిసెంబర్17,ప్రభాతవార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5:00 గంటలకు నారాయణపేట డిపో ముందు ధర్నాకు దిగారు. ప్రతిరోజు నారాయణపేట నుండి అమ్మిరెడ్డి పల్లి గ్రామం, కోటకొండ తిరుమలాపూర్, భూనేడు, కంసాన్ పల్లి, కానుకుర్తి, ఇట్లాపూర్, గాదుప్ప, అమీన్పూర్, జిల్లాల్పూర్, పేరపల్లా ఒత్తుగుండ్ల, గ్రామాలకు స్కూల్ సమయానికి ఉదయం 8:30కు బస్సులు రాకుండా స్కూల్, కళాశాల టైము అయిపోయాక 10 మరియు 10:30 టైం లో గ్రామాలకు బస్సులు వస్తున్నాయని అనేకసార్లు విద్యార్థులకు చాలా ఇబ్బంది అవుతుందని ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా కూడా ఏమాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. ధర్నాకు ఏబీవీపీ, పిడిఎస్ అన్ని విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. డిపో మేనేజర్ నిరక్ష ్యం వల్ల విద్యార్థులకు చాలా ఇబ్బంది కలుగుతుందని, ఏదో సాకుతో సీఎం పర్యటన పేరుతో, పీఎం పర్యటన పేరుతో ఇతర కారణాలతో, ఎలక్షన్ పేరుతో బస్సులు రాలేను పరిస్థితి ఉందని చెప్పి హైదరాబాదు, మహబూబ్నగర్ ఇతర పెళ్లిళ్లకు మరియు ఫంక్షన్లకు నారాయణపేట డిపో బస్సులు పంపిస్తూ విద్యార్థులకు చాలా ఇబ్బంది కలిగిస్తున్నారని పేర్కొన్నారు. డిపో మేనేజర్ నిరక్ష్యాన్ని విడనాడాలని రెండు గంటలకు పైగా మెయిన్ రోడ్ పై రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థులు ఆవేశానికి గురై డిపో మేనేజర్ ఆఫీస్ వద్దకు చేరుకొని ఆందోళన చేయడంతో బూనేడు ఇట్లాపూర్, యానగుంది బస్సు పంపించడంతో విద్యార్థులు వెనుదిరిగారు. ప్రతి గ్రామానికి సమయానికి బస్సు కల్పిస్తామని హామీ ఇవ్వడంలో ధర్నా విరమించారు.

## అన్నా సాగర్‌లో బీఆర్ఎస్ 10/10

**భూత్పూర్. డిసెంబర్17, ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి స్వగ్రామమైన అన్న సాగర్‌లో సర్పంచ్ ఎన్నికల్లో ఆల శ్రీకాంత్‌రెడ్డి ఘనవిజయం సాధించారు. ఈ గ్రామపంచాయతీలో 10 వార్డులకుగాను 10వార్డులు బీఆర్ఎస్ మద్దతు తెలిపిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. సర్పంచ్ ఉప సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యుల పదవులన్నీ కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేశారు. దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత ఊళ్లో ఘోర పరాజయం పాలై.. అన్నా సాగర్ లో మాజీ ఎమ్మెల్యేను ఓడించేందుకు ప్రచారం నిర్వహించిన ఓటర్లు కనికరించలేదు. కనీసం ఒక్క వార్డు కూడా కాంగ్రెస్ పార్టీ దక్కించు కోకపోవడం.. ఎమ్మెల్యే సొంత ఊర్లోనే కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోవడం జరిగింది. ఈ మేరకు బుధవారం గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డినీ పూలమాలలతో ముంచెత్తారు. సంబురాలు చేసుకున్నారు.

## జడ్చర్లలో బీఆర్ఎస్ హవా

**మూడు విడతల్లో ప్రకటించిన ఫలితాల్లో కారు జోరు**

**ఓటు వేసి ఆశీర్వదించిన ప్రజలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**



**జడ్చర్ల, డిసెంబర్17,ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ తన సత్తా చాటింది. అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించింది. జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 188 గ్రామ పంచాయతీలు ఉండగా 85 గ్రామ పంచాయతీలలో గులాబీ జెండా ఎగరేసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా జడ్చర్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాల అభివృద్ధి కోసం పని చేస్తామని, అధికార పార్టీని ఎదిరించి విజయం సాధించిన నూతన సర్పంచ్ లు,వార్డు మెంబర్ లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి ఘన విజయం కోసం శ్రమించిన పార్టీ నాయకత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## విద్యతోనే అసమానతలు తొలగిపోతాయి

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్17, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణకు సంబంధించిన స్టడీ మెటీరియల్స్‌ను ప్రస్తుతం కంప్యూటర్ శిక్షణ పొందుతున్న మహిళా సంఘాల సభ్యులకు ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, భవిష్యత్తులో మహిళా సంఘాల సభ్యుల ఖాతా వివరాలు, లోన్ వివరాలు తదితర అన్ని అంశాలు కంప్యూటర్ ఆధారిత విధానంలో నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అందరికన్నా ..మహబూబ్‌నగర్ ఫస్ట్.. (ముందుండాలనే ) సంకల్పంతోనే మహిళల కోసం ఈ కార్యక్రమాన్ని తన సొంత నిధులతో చేపట్టినట్లు చెప్పారు. ఒక మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా విద్యావంతులే అవుతారని, మహిళలు చదువుకుంటేనే సమాజంలో ఉన్న అసమానతలు తొలగిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే ఒక శక్తివంతమైన అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడమే కాకుండా, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పే అద్భుతమైన కార్యక్రమమిది అని ఎమ్మెల్యే గారు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు

**-అధికార పార్టీ ఎమ్మెల్యేల సొంతూర్లో సర్పంచుల ఓటమి**

**-జీపీ ఎన్నికల్లో సగం సగం పంచుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్**

**-అధికార పార్టీకి కొంత అసంతృప్తినిచ్చిన జీపీ ఎన్నికలు**



**భూత్పూర్,డిసెంబర్ 17,ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో మూడు విడతలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీ కాంగ్రెస్‌కు కొంత అసంతృప్తినిచ్చాయనే చెప్పాలి.తొలి విడత ఈ నెల 11న,రెండో విడత 14న,మూడో విడత 17న గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగినప్పటికి అధికార పార్టీ కాంగ్రెస్‌కు ఆశించిన స్థానాలు లభించలేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు సొంత ఇలాఖాల్లో ఓటమిని చవిచూడాల్సిన పరిస్థితేర్పడింది.దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) సొంతూరు చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఓటమి పాలయ్యారు.ఇలాగే జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనురుధ్‌రెడ్డి సొంత గ్రామంలో అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి ఓటమి పాలు కాగా,బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి,నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఇలాఖాల్లో తాము బలపరిచిన అభ్యర్థులెవరూ గెలువలేక పోయారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో కార్యాచరణ పొందకపోవడం,మహిళా ఫించన్లు అమలు చేయకపోవడం వంటి అంశాలు కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో కొంత ప్రభావం చూపాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు రాష్ట్రంలోని 182మండలాల్లో 3,752జీపీలలో మొత్తం 4159 సర్పంచి స్థానాలకుగాను 394జీపీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.మిగిలిన 3752సర్పంచి స్థానాలకు 12,652మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.ఈ జీపీలలో 36,425 వార్డులకుగాను 7,908వార్డులు ఏకగ్రీవమయ్యాయి.మిగిలిన 28,410వార్డులకు 75,725మంది సభ్యులు పోటీపడుతున్నారు.బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరిగాయి.స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ నాటి నుంచి గ్రామాల్లో సర్పంచులు,వార్డు సభ్యుల పదవులనాశించే స్థానిక నాయకులు హల్‌చల్ చేస్తూ పదవుల కోసం ఆరాటపడుతున్నారు.స్థానిక ఎన్నికలకుసర్పంచులు, వార్డు సభ్యుల పదవుల కోసం రిజర్వేషన్లు ఇంచుమించు ఖరారు కావడంతో పదవులనాశించే స్థానిక నాయకులు తమ అధినేతలతో పావులు కదిపి కొంత వరకు విజయం సాధించడంలో కొంత వరకు కృతకృత్యుల య్యారు.ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రు.10లక్షల ప్రోత్సాహకం అందిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించిన నేపథ్యంలో వచ్చే నిధులతో తమ గ్రామాలను అభివృద్ధి చేయవచ్చనే భావనతో ఆయా గ్రామాల్లో పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు స్థానిక నేతలు అవిరళ కృషి చేశారు.ఉమ్మడి పాలమూరు జిల్లాల సర్పంచు స్థానాలను పరిశీలిస్తే మహబూబ్‌నగర్ -441,ాగర్‌కర్నూల్-461,నారాయణపేట-280,వనపర్తి-268,జోగళాంబ గద్దాల-255లకు ఎన్నికలు జరిగాయి.వీటిలో కాంగ్రెస్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయనే చెప్పాలి. అధికార పార్టీ కాంగ్రెస్,ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మిశ్రమ ఫలితాలందుకున్నాయని చెప్పకతప్పదు. కొన్నిచోట్ల కాంగ్రెస్ ఆధిక్యం ప్రదర్శిస్తే,మరికొన్ని చోట్ల బీఆర్ఎస్ ప్రభావం చూపింది. భూత్పూర్ మండలంలో 19జీపీలు,174వార్డులకు ఎన్నికలు బుధవారం జరిగాయి.ఏదేమైనా మూడో విడతలో జరిగిన సర్పంచు ఎన్నికల్లో భూత్పూర్ మండలంలోని 19గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ 12సర్పంచి స్థానాలు.ఏడు స్థానాల్లో బీఆర్ఎస్ బల పరిచిన సర్పంచి అభ్యర్థులువిజయం సాధించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యం లో సర్పంచులు,వార్డు సభ్యుల ఎన్నిక కొంత అసంతృప్తిచిచ్చాయని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో మరమ్మతులు చేస్తాం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్, డిసెంబర్17,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నగరంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి గుంతలు, గతుకులతో ప్రమాదకరంగా మారిందని ప్రజల నుంచి వినతులు అందాయని, ఆ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన స్వయంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతానికి చేరుకుని స్థానిక మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌తో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన ఎమ్మెల్యే, ఆర్ అండ్ బి పనులు చేసే ఇంజనీర్స్ తోటి పనులకు ఎస్టిమేట్స్ తయారు చేసి, వారం రోజుల్లోగా మరమ్మత్తు పనులు ప్రారంభించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే స్వామి వివేకానంద మహిళా సంఘం భవనాన్ని పునరుద్ధరించి, మహిళా సంఘ భవనం



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

పైభాగంలో విద్యార్థుల కోసం ఆధునిక గ్రంథాలయం మరియు స్టడీ రూం ఏర్పాటు కోసం ఎస్టిమేట్స్ తయారు చేయాలని ఎమ్మెల్యే కమీషనర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మెరుగైన చదువు వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ, నాయకులు అద్దీస్, మహమ్మూద్ రియాజుద్దీన్, చందు యాదవ్ పాల్గొన్నారు.

